క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘం భవనంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయబడుతాయన్నారు.

సాఠేను ఆదర్శంగా తీసుకోండి

తానూరు: ప్రతి ఒక్కరూ అన్నాబావు సాఠేను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని మాదిగ సంఘం తాలూక అధ్యక్షులు ఉత్తం బాలేరావ్ అన్నారు. గురువారం మండలంలోని ఝరి(బి)లో సాఠే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. అనంతరం వీధుల్లో సాఠే చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, గోవింద్‌రావ్ పటేల్, బాలాజీ, రోహిదాస్, గంగాధర్, సాయినాథ్, బాబన్న, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు చెక్కులు పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో శ్యాంసుందర్

లోకేశ్వరం: అర్హులైన బీసీలకు రూ.లక్ష సాయం అందిస్తామని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. గురువారం లోకేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో 38 మందికి రూ.లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, సర్పంచ్‌లు ముత్తగౌడ్, వెంకట్‌రావు, శైలజ, బీఆర్‌ఎస్ నాయకులు కపిల్, భోజన్న, శ్యాంసుందర్, సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్, సాయారెడ్డి, అనిల్ ఉన్నారు.

35 మందికి మంజూరు

కుంటాల: మండలంలోని 15 గ్రామపంచాయతీల పరిధిలో 35 మంది బీసీలకు రూ.లక్ష చొప్పున చెక్కులు మంజూరైనట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటిని పంచాయతీ కార్యదర్శులకు అందించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించామని వెల్లడించారు.

అల్ఫోర్స్‌లో వరలక్ష్మీ వ్రతం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్‌లో గురువారం ముందస్తు వరలక్ష్మీ వ్రతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్రతం గొప్పతనం గురించి ఉపాధ్యాయులు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను మరువద్దని చైర్మన్ నరేందర్‌రెడ్డి సూచించారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

ఖానాపూర్: పట్టణంలోని వాసవిమాత ఆలయంలో గురువారం శ్రీశైవక్షేత్ర వనితాశక్తి ఖానాపూర్–2 శాఖ ఆధ్వర్యంలో మనసారా..మన సారె–మన అమ్మకు కార్యక్రమం నిర్వహించారు. అర్చకుడు అభిషేక్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో జితేందర్, మాధవి, రాణి, సరిత, వాసవి, స్వాతి, లత, అంకిత, ప్రవంతి, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్‌తోపాటు నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌కు చెందిన పలువురు యువకులు గురువారం బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఆయన క్యాంపు కార్యాలయంలో బీజేపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముత్యంరెడ్డి, శైలేశ్వర్, వీరేశ్, వాడిసెల అర్జున్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పూజలు

కుంటాల: రెండో షిరిడీగా పేరొందిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. వ్యాపారవేత్త అల్లోల గోవర్ధన్ రెడ్డి, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటవార్ దశరథ్, న్యాయవాది పుట్ట అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో గోసేవ, బాబాకు మంగళ స్నానం, అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వరదొస్తే రాకపోకలు బంద్

- ఏటా వర్షాకాలంలో పొంగిపొర్లుతున్న లోలెవల్ వంతెనలు
- పలుచోట్ల వాగులపై కానరాని వంతెనలు
- అత్యవసర వేళ ప్రజలకు తిప్పలు
- నూతన వంతెనల నిర్మాణం చేపట్టాలని వేడుకోలు



దిలావర్‌పూర్‌-ఖానాపూర్ లోలెవల్ వంతెనపై నుంచి వెళ్తున్న వరద



కుసుంపూర్‌-ఎర్వచింతల్ మధ్యలో వాగుపై కానరాని వంతెన

ఖానాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న లోలెవల్ వంతెనలు చిన్నపాటి వర్షాలకే పొంగిపొర్లుతున్నాయి. దీంతో వివిధ గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తే వారి బాధలు వర్ణనాతీతం. దశాబ్దాల కిందట నిర్మించినవి కావడంతో చిన్నపాటి వానలకే లోలెవల్ వంతెనలు మునుగుతున్నాయి. వర్షాకాలంలో వివిధ పనుల నిమిత్తం మరో చోటకు వెళ్లే ప్రజలకు తిరిగి సొంత ఊరు రావడం కష్టమవుతోంది. దీంతో వారు బస్టాండ్, బంధువుల ఇళ్లలో తలదాచుకొని వరద తగ్గిన తర్వాత ఇళ్లకు వెళ్తున్నారు.

పనుల ప్రారంభం ఎప్పుడో..

పట్టణ శివారులోని దిలావర్‌పూర్‌–ఖానాపూర్ మార్గంతోపాటు తర్లపాడ్‌–ఖానాపూర్ మార్గంలోని రెంకోని వాగుపై నుంచి చిన్నపాటి వానలకే వరద పారుతుంది. వాటి స్థానంలో పెద్ద వంతెనలు నిర్మించేందుకు రెండు నెలల కిందట ఆయా చోట్ల మంత్రి, ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. వర్షాకాలం కారణంగా పనులు ప్రారంభించలేదు.

ఆయా చోట్ల అదే దుస్థితి..

మండలంలోని సుర్జాపూర్ రోడ్డు డ్యాంతోపాటు బీర్నంది మార్గంలోని కొమ్ముతండా సమీపంలో చింతౌర్రె, రాజూరా గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్లపైనే వరద ప్రవహిస్తుంది.

108 వాహనం వెళ్లని దుస్థితిలో గ్రామాలు..

మండలంలోని ఎర్వచింతల్ పంచాయతీ పరిధిలోని కుసుంపూర్ గ్రామానికి కనీసం 108 వాహనం వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఈ రెండు మార్గాలకు మధ్యలో వంతెన నిర్మించాల్సి ఉన్నా దాని ఊసెత్తడం లేదు. గతంలో ఇదే వాగులో పలువురు గ్రామస్తులు కొట్టుకుపోయి మృతి చెందారని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు. మండలంలోని బావాపూర్(ఆర్) పరిధిలోని పంగిడిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు సైతం అధ్వానంగా మారిందని.. సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూడాలి..

వరద వచ్చే ప్రాంతాల్లో వంతెనలు నిర్మించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, పాలకులను వేడుకుంటున్నారు.

ఇక్కట్లు పడుతున్నాం

దిలావర్‌పూర్ సమీపంలోని లోలెవెల్ వంతెనపై వరద రావడంతో సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే అధికారులు వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలి. ఎన్నికల కోడ్ వస్తే వచ్చే ఏడాది కూడా కష్టాలు తప్పవు.
– ఆరె చిన్నగంగన్న, గోదలపంపు

వర్షాలు తగ్గాక పనులు ప్రారంభిస్తాం

మండలంలోని దిలావర్‌పూర్‌–ఖానాపూర్ వంతెన ఖానాపూర్‌–తర్లపాడ్ వంతెనల నిర్మాణానికి భూమిపూజ చేశాం. కానీ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పనులు ప్రారంభించలేదు. వాతావరణం అనుకూలంగా ఉంటే వేగంగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. నిబంధనల ప్రకారం నిర్మాణ పనులను గడువులోగా చేపడుతాం.
– మల్లారెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ

మార్కెట్‌లో ‘శ్రావణ’ సందడి



శ్రావణమాస శుక్రవారం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ మార్కెట్ పరిసరాలు గురువారం సందడిగా మారాయి. వరలక్ష్మీ వ్రతం కోసం పూజాసామగ్రి, పూలు, పండ్లు కొనేందుకు మహిళలు దుకాణాల వద్ద బారులు తీరారు. అమ్మవారి ప్రతిమలు కొనేందుకు ఎక్కువగా ఆసక్తి చూపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





‘ఉపాధి’లో అవకతవకలు ఉపేక్షించం

- డీఆర్డీవో విజయలక్ష్మి



ప్రజావేదిక రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

దిలావర్‌పూర్: గ్రామాల్లో చేపట్టే ఉపాధిహామీ పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని.. ఎలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించబోమని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం దిలావర్‌పూర్‌లో 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూన్ 2021నుంచి మార్చి 2023 వరకు జరిగిన పనులపై తనిఖీ చేపట్టి పనులు జరిగిన తీరును బహిర్గత పరిచారు. గత 15 రోజులుగా పంచాయతీల పరిధిలో జరిగిన పనులు, కూలీల హాజరు, వారికి అందించిన కూలి, మెటీరియల్ చెల్లింపులు, ప్లాంటేషన్ అంశాలపై మస్టర్ల ఆధారంగా రికార్డులు పరిశీలించారు. చిన్న పొరపాట్లు దొర్లడంతో సదరు గ్రామపంచాయతీ కార్యదర్శులకు మండలవ్యాప్తంగా రూ 4,984 రికవరీ చేయాలని.. అలాగే అపరాధ రుసుం కింద రూ.3వేలు చెల్లించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, అంబుడ్స్‌మన్ అధికారి నవీన్, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఎంపీడీఓ మోహన్, ఏపీఓలు దివ్యారెడ్డి, జగన్నాథ్, టీఏలు, ఎఫ్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రూ.లక్ష సాయం అందించండి

- మహాగాం గ్రామస్తుల రాస్తారోకో

భైంసారూరల్: అర్హులైన బీసీలందరికీ రూ.లక్ష రుణ సాయం అందించాలని మండలంలోని మహాగాం గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భైంసాలో మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో నిర్మల్‌–భైంసా ప్రధాన రహదారిపై సర్పంచ్ రాకేశ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. గ్రామంలో 195 మంది బీసీలు రూ.లక్ష సాయానికి దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికే వచ్చిందన్నారు. ఈ మేరకు గ్రామస్తులంతా భైంసాకు చేరుకొని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పట్టణ, రూరల్ సీఐలు ఎల్.శ్రీను, నైలు, సిబ్బంది అక్కడకు వెళ్లి ఆందోళనకారులకు నచ్చజెప్పినా శాంతించలేదు. అనంతరం ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి వచ్చి వారితో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తామనడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిద్దూర్ సర్పంచు మారుతి, పలువురు బీసీ సంఘం నాయకులు సుంకెట పోశెట్టి, మహేశ్‌బాబు తదితరులు గ్రామస్తులు ఉన్నారు.



భైంసాలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- ప్రవాస యోజనలో బీజేపీ ఎమ్మెల్యే రాజేశ్ పవార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్ పవార్

లోకేశ్వరం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మహారాష్ట్రలోని నాయేగాం ఎమ్మెల్యే రాజేష్ పవార్ అన్నారు. అసెంబ్లీ ప్రవాస యోజనలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఓ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం గ్రామ పంచాయతీ, బూత్ కమిటీ, శక్తి కేంద్రం, మండల, నియోజకవర్గం ఇన్‌చార్జులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావ్ పటేల్, మోహన్‌రావు పటేల్, లక్ష్మీపురం నారాయణ్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, కోకన్వీనర్ సుమన్‌కుమార్, ఎంపీటీసీ జయసాగర్‌రావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, అనిల్, రమేష్, రాజు, భూమన్న, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ సర్వే చేస్తున్న అధికారులు



మామడ: రాయదారిలో పరిశీలిస్తున్న సర్ఫరాజ్



ముధోల్‌లో సర్వే పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. గురువారం మండలంలోని వడ్యాల్‌లో ఎంపీడీవో శేఖర్, కనకాపూర్‌లో తహసీల్దార్ శ్రీలత, వడ్యాల్ తండాలో ఎంపీవో నసీరుద్దిన్, పార్‌పెల్లిలో ఏవో ప్రవీణ్‌కుమార్, చామన్‌పెల్లిలో వాణిశ్రీ, బాబాపూర్‌లో డీటీ గంగాధర్ పర్యటించారు. ఈసందర్భంగా దరఖాస్తుదారుల ధ్రువపత్రాలు, ఇంటిస్థలం పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

మామడ: మండలంలోని రాయదారి, లింగాపూర్, మామడ గ్రామాల్లో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ పర్యటించారు. గృహలక్ష్మి కిందట దరఖాస్తు చేసుకున్న ఇళ్ల స్థలాలను, ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, గ్రామస్తులు ఉన్నారు.

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో తహసీల్దార్ శివరాజ్ గృహలక్ష్మి దరఖాస్తుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు, ఇంటిస్థలం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ విజయ, సర్పంచ్ గంగారెడ్డి, కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో కొనసాగుతున్న గృహలక్ష్మి సర్వేను డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. అర్హులనే పథకానికి ఎంపిక చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎంపీడీవో సురేశ్‌బాబు, ఈవో పవన్, సిబ్బంది తదితరులున్నారు.

26, 27 తేదీల్లో ఓటరు నమోదు కార్యక్రమం

కుంటాల: వచ్చే అక్టోబర్ నాటికి 18ఏళ్లు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బీఎల్‌వోలు శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు దరఖాస్తుతోపాటు ఓటర్ లిస్టులో తప్పులుంటే సరి చేసుకోవాలన్నారు. సమావేశంలో డీటీ నరేశ్‌గౌడ్, ఆర్‌ఐ అడెల్లు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 26, 27 తేదీలతోపాటు వచ్చే నెల 2,3 తేదీల్లో ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ మోతీరాం అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామాల్లోని బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించారు. ఓటరు కార్డులో తప్పొప్పుల సవరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలకిషన్, ఏఎస్‌వో సౌజన్య తదితరులు ఉన్నారు.

మంత్రి క్షమాపణ చెప్పాలని రాస్తారోకో



బైఠాయించిన గిరిజన సంఘాల నాయకులు

భైంసారూరల్: హైదరాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబును చెంపదెబ్బ కొట్టిన మంత్రి తలసాని శ్రీనివాస్ వెంటనే క్షమాపణ చెప్పాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భైంసా బస్టాండ్ సమీపంలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం నిరసనకారులు మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సారంగాపూర్: భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబుపై దాడి చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్ గిరిజనులకు క్షమాపణ చెప్పాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు పవార్ రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో ఆయన సేవాలాల్ సేన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు జాదవ్ ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, శివరాం, ఉపసర్పంచ్ ఉత్తం, ప్రేమ్‌సింగ్ నాయక్, లక్ష్మణ్, రవి, దేవిదాస్, బాపురావు, తదితరులు ఉన్నారు.

క్షీరాభిషేకం

పెంబి: దివ్యాంగులకు పెన్షన్ రూ.4,116కు పెంచినందుకు గురువారం మండల కేంద్రంలో దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, దివ్యాంగుల సంఘం మండలాధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు వి నోద్, సుజాత, శంకర్ తదితరులు ఉన్నారు.

పేదలకే దళితబంధు ఇవ్వండి

నర్సాపూర్(జి): నిరుపేదలకే దళితబంధు ఇవ్వాలని దళిత సంఘం నాయకులు మండలంలోని గొల్లమాడలో గురువారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. దళితబంధు ఎంపికలో బీఆర్‌ఎస్ నాయకులకు ప్రాధాన్యమిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం

నర్సాపూర్(జి):మండలంలోని నర్సాపూర్(జి), టెంబరేణి, అంజనీతండా గ్రామాలలో గురువారం బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా యువ నాయకుడు అల్లోల గౌతంరెడ్డి పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. టెంబరేణిలో 20 మంది మైనార్టీ యువకులు గౌతం రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మంత్రి అల్లోల పీఏ నాళం శ్రీనివాస్, నర్సాపూర్(జి) సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేష్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పాపెన్ రాజేశ్వర్, కొండ్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ముధోల్: ముధోల్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ అతికొద్దీన్‌ను గురువారం రేషన్ డీలర్లు సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

చంద్రయాన్‌-3 విజయోత్సవాలు



కద్తాల్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కడెం: ఇస్రో, రాకెట్ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

ఖానాపూర్: పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల యూనియన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో కలిసి చంద్రయాన్‌–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పుప్పాల మల్లేశ్, ప్రభాకర్, విద్యాలత, మనోహర్ స్వామి, సంకేత్, సాహు, అనిత, ప్రవీణ్, గంగాధర్ ఉన్నారు.

సారంగాపూర్: చంద్రయాన్‌–3 ప్రయోగం విజయవంతం కావడంతో మండలంలోని స్వర్ణ గ్రామంలో వేదజ్ఞాన పాఠశాల విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. కరస్పాండెంట్ నారాయణ, డైరెక్టర్ సాయికుమార్, రాజేశ్వర్, దివ్య, సులోచన ఉన్నారు.

సోన్: మండలంలోని కద్తాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం తొమ్మిదో తరగతి విద్యార్థులు చంద్రయాన్‌–3 ప్రయోగ నమూనాను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు మహేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని అల్లంపల్లి జీయర్ గురుకులంలో సంబరాలు చేసుకున్నారు. ఇస్రో, రాకెట్ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది.

దస్తురాబాద్: మండలంలోని గొడిసిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో చంద్రయాన్‌–3 విజయోత్సవ సంబురాలు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, విజయ్‌కుమార్, శ్రీదేవి, రాధిక, వెంకట్రాజం, రాజమణి, సత్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



లోకేశ్వరం: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

లోకేశ్వరం: మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ముధోల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యేను సన్మానించి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, నారాయణ్‌రెడ్డి, రత్నాకర్‌రావు, శ్యాంసుందర్, దిగంబర్, సాయారెడ్డి, కపిల్, ఆంజనేయులు, అనిల్, దిగంబర్, సుదర్శన్‌రెడ్డి, సాయన్న ఉన్నారు.

కుంటాల: టికెట్ రావడాన్ని హర్షిస్తూ మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం బాసరలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కోర్వ శ్యాం, డైరెక్టర్ పురుషోత్తం, రామారావు, మల్లేశ్‌గౌడ్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కుభీర్ మండల బీఆర్‌ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

‘యాదవ యుద్ధభేరి’కి తరలిరండి

తానూరు: హైదరాబాద్‌లోని నాగోల్ శివంకన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించే యాదవ యుద్ధభేరి సభకు యాదవులు తరలిరావాలని ఆ సంఘం నాయకులు శ్రీనివాస్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి బీపీ మండల్ యాదవ్ మనువడు సూరజ్ మండల్ హాజరవుతారని పేర్కొన్నారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన సిరిపురం ముత్తన్న, నడిపి భూమన్న అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం బాధిత కుటుంబసభ్యులను డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు పరామర్శించారు. వారి వెంట నేతలు రాంరెడ్డి, రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, రవి ఉన్నారు.